BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 14 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## గాజాపై ఇజ్రాయెల్ దాడులు.. 32 మంది మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గాజా నగరంపై ఇజ్రాయెల్ ఉధృతంగా సాగించిన దాడుల్లో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 12 మంది చిన్నారులు ఉన్నారని షియా ఆస్పత్రి వర్గాలు శనివారం వెల్లడించాయి. గాజా సిటీపై ఇటీవల ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. హమాస్ నిఘా విభాగాలు ఉన్నాయన్న ఆరోపణపై అనేక భవనాలను ధ్వంసం చేసింది. హమాస్ గట్టి పట్టున్న గాజా నగరం లోని చాలా భాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి వీలుగా నివాసీయులైన ప్రజలను తక్షణం ఖాళీ చేసి వెళ్లి పోవాలని ఇజ్రాయెల్ ఆదేశించింది. గత రాత్రి ఒకసారి దాడి చేయగా, మళ్లీ తెల్లవారు జామున మరో దాడి జరిగింది. షేక్ రద్వాన్ పొరుగున ఉన్న ఒక ఇంటిపై జరిగిన దాడిలో ఒకే కుటుంబంలో తల్లి, ఆమె ముగ్గురు పిల్లలతోసహా పది మంది మృతి చెందారు. నగరాన్ని పదేపదే ఖాళీ చేయాలన్న హెచ్చరికలతో గత కొన్ని వారాలుగా అనేక మంది తమ నివాసాలను విడిచిపెడుతున్నారు. రవాణా ఖర్చులు భరించలేక వేరే నివాసాలు లభించక చాలా మంది ఇంకా నగరంలో ఉండిపోవలసి వస్తోంది. ఎక్కడా తమకు భద్రత లేదని చెబుతున్నారు.అయితే మానవీయ జోన్‌గా పిలిచే దక్షిణ ప్రాంతానికి తరలిపోవాలని ఇజ్రాయెల్ ఆర్మీ హెచ్చరిస్తోంది. ఉత్తర గాజాలో నివసిస్తున్న మిలియన్ మందిలో నాలుగోవంతు మంది నగరాన్ని విడిచిపెట్టారని ఆర్మీ అధికార ప్రతినిధి అవిచాయ్ ఆడ్రే చెప్పారు. గత 24 గంటల్లో పిల్లలతోసహా ఏడుగురు ఆకలి మంటలతో చనిపోయారని, దీంతో పోషణ లేక చనిపోయిన వారి సంఖ్య 145 మంది పిల్లలతోసహా మొత్తం 420 కి సంఖ్య పెరిగిందని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ శనివారం వివరించింది. గాజాలో బందీలుగా ఉన్న వారి కుటుంబాలు దాడులు ఆపాల్సిందిగా ఇజ్రాయెల్ ఆర్మీని వేడుకుంటోంది.

# మన వాటా మనకు దక్కాల్సిందే..

- కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించి తీరాలి
- ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలి
- ఆధారాలన్నింటినీ న్యాయ నిపుణులకు ఇవ్వండి
- విచారణలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారు
- న్యాయనిపుణులు, ఇరిగేషన్ ఇంజినీర్లతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు న్యాయ నిపుణులను, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణా నదిలో నికర జలాలైనా, మిగులు జలా లైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివా టాలో ఒక చుక్క నీరు కుడా వదులుకునేది లేదని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది. తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి స్వయంగా ఈ విచారణలో పాల్గొంటారని ముఖ్యమంత్రి గారు తెలిపారు. కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, మనకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు న్యాయ నిపుణులకు పలు సూచనలు చేశారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్ కు సమర్పించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్? ముందు ఉంచాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్?కు అందించాలని సూచించారు.

గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఆంధ్రప్రదేశ్ కు 512 టీఎంసీలు కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. గత ప్రభుత్వం 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునల్? ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎంకి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో ఈ పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణా నదిపై తలపెట్టిన పాలమూరు - రంగారెడ్డి నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్‌లో పెట్టిందన్నారు. మిగితా 2వ పేజీలో

## మణిపూర్‌ను శాంతి-సౌభాగ్యాల నేలగా మారుస్తాం

- ప్రధాని మోడీ
- బాధితులకు భరోసా, అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

"మణిపూర్ పేరుకు తగ్గట్టుగానే శాంతి, సౌభాగ్యాలకు ప్రతీకగా నిలవాలి. ఇదే మా లక్ష్యం" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. రెండు సంవత్సరాల తర్వాత మణిపూర్ పర్యటించిన ఆయన శనివారం చురాచంద్‌పూర్‌లో బహిరంగ సభలో మాట్లాడారు. తెగల ఘర్షణలతో దెబ్బతిన్న ఈ నేలకు సుభిక్షం తీసుకొచ్చేందుకు కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఇంఫాల్, చురాచంద్‌పూర్‌లోని శరణార్థ శిబిరాలను సందర్శించిన ప్రధాని, కుకీ, మెయితీ తెగల బాధితులతో మాట్లాడారు. గత చేదు అనుభవాలను మరిపిస్తూ భవిష్యత్తు ప్రశాంతతపై విశ్వాసం కలిగించారు. "వారి కలలను సాకారం చేస్తాం" అని హామీ ఇచ్చారు. "ఏ ప్రాంతంలోనైనా అభివృద్ధికి శాంతియుత వాతావరణం తప్పనిసరి. గత పదకొండు ఏళ్లలో ఈశాన్యంలో అనేక ఘర్షణలకు పరిష్కారం చూపాం" అని ప్రధాని మోడీ గుర్తు చేశారు. సంప్రదింపులు, పరస్పర గౌరవం, ఆమోదయోగ్యతలతో శాంతి సాధ్యమని తెలిపారు.

**నిర్వాసితులకు ఇళ్లు, ప్రత్యేక ప్యాకేజీ**

ఘర్షణలతో నిరాశ్రయులైన వారికి 7,000 కొత్త గృహాలు నిర్మించేందుకు కేంద్రం ముందుకు వచ్చిందని చెప్పారు. అదనంగా రూ.3,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీలో రూ.500 కోట్లు ప్రత్యేకించి బాధితుల కోసం కేటాయించామని వెల్లడించారు.

**విద్య, ఆరోగ్య రంగాల్లో పురోగతి**

స్వాతంత్ర్యం తర్వాత మణిపూర్ పర్వత ప్రాంతంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా లేనని గుర్తుచేసిన ప్రధాని, ఇప్పుడు చురాచంద్‌పూర్‌లో వైద్య కళాశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పిల్లలకు చదువు, ప్రజలకు ఆరోగ్య సౌకర్యాలు అందేలా కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు.

మణిపూర్ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ రూ.7,300 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. త్వరలోనే దేశపు తొలి జాతీయ క్రీడా విశ్వవిద్యాలయం మణిపూర్‌లో ఏర్పడనుందని ప్రకటించారు.

2023లో రిజర్వేషన్ల కోటా వివాదంతో కుకీ, మెయితీ తెగల మధ్య ఘర్షణలు రగిలాయి. ఇప్పటివరకు 250 మందికి పైగా మృతి చెందగా, వేలాదిగా నిర్వాసితులు అయ్యారు. ఈ పరిస్థితుల్లో ప్రధాని మోడీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని పర్యటన దశలో ఇంఫాల్, చురాచంద్‌పూర్ ప్రాంతాల్లో కేంద్ర బలగాలను విస్తృతంగా మోహరించారు. సభా ప్రాంగణాలు దుర్భేద్యంగా భద్రతా వలయంలో ఉంచబడ్డాయి.

## అవసరమైతే ఎక్సైజ్ శాఖకు ఆయుధాలిస్తాం



- మంత్రి జూపల్లి కృష్ణారావు
- గంజాయి, డ్రగ్స్, నాటుసారా, నాన్ డ్యూటీ లిక్కర్‌పై ఉక్కుపాదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గంజాయి, సింథటిక్ డ్రగ్స్, నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగంపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు కఠిన చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ప్రజల ప్రాణాల రక్షణ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.ఎక్సైజ్ శాఖ భవన్‌లో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎస్టీఎఫ్ టీమ్‌లు మంచిగా పని చేస్తే వారికి అవసరమైతే ఆయుధాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. క్రమశిక్షణతో పనిచేసే సిబ్బందిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

**నల్ల బెల్లంపై మార్గదర్శకాలు**

నల్ల బెల్లం తయారీ, విక్రయాలపై పూర్తి స్థాయి అధ్యయనం జరపాలని సూచించారు. పట్టుబడిన నల్ల బెల్లాన్ని రైతులకు సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను పట్టుకున్నప్పుడు వాటిని పగులగొట్టకుండా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని మంత్రి అన్నారు. వాటిని జాతీయ ఉత్పత్తిగా గుర్తించి మార్కెట్‌లోకి తీసుకురావడంపై చర్యలు చేపట్టాలని సూచించారు.

నాచారం, చర్లపల్లి ప్రాంతాల్లో నడుస్తున్న ఇన్‌లీగల్ పరిశ్రమలపై తనిఖీలు చేపట్టాలని, ఒకే లైసెన్స్‌పై బహుళ బార్లు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**ఫామ్ హౌస్‌లు, బ్రాండీ షాపులపై చర్యలు**

ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాలని, బ్రాండీ షాపుల సిట్టింగ్ రైమ్‌లపై నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న రైస్ మిల్లులు, ఇతర ప్రాంతాలను నిరంతర పర్యవేక్షణలో ఉంచాలని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

## రేవంత్‌కు దమ్ముంటే ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ ఫిరాయింపుల రాజకీయం బట్టబయలు
- ఉప ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారు
- గద్వాల గర్జన సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గద్వాలలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గద్వాల గర్జన పేరుతో నిర్వహించిన బహిరంగ సమావేశానికి భారీగా తరలివచ్చిన జనసమూహం ముందు మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డికి దమ్ముంటే కాంగ్రెస్‌లోకి మారిన పదిమంది ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు సిద్ధం కావాలి" అని సవాల్ విసిరారు. ప్రజల ఆకాంక్షలను, అభిప్రాయాలను తుంగలో తొక్కి వ్యక్తిగత అవసరాల కోసం పార్టీలను మార్చిన ఎమ్మెల్యేలకు ప్రజల కోర్టులో తగిన తీర్పు తప్పదన్నారు.

"పార్టీలు మారిన ఆ పదిమంది ఎమ్మెల్యేల పరిస్థితి దయనీయంగా ఉంది. అసలు వాళ్లది ఏ పార్టీ అనేది చెప్పుకోలేని దుస్థితి. స్వార్థం కోసం, ఆస్తులు పెంచుకోవడానికే అవకాశవాదంతో పార్టీలు మారారు. ఈ పార్టీ ఫిరాయింపుల అంశంలో సుప్రీంకోర్టు కూడా సీరియస్‌గా ఉంది. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా రాష్ట్రంలోని పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవు. ప్రజలే బుద్ధి చెబుతారు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బహిరంగ సభ సందర్భంగా భారీ సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. వర్షంలోనూ భారీగా తరలివచ్చిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ, "తెలంగాణ ఉద్యమంలో గద్వాల ముందు వరుసలో నిలిచింది. జోగులాంబ తల్లి ఆశీస్సులతో గద్వాల జిల్లాగా మారింది. గద్వాలను జిల్లా కేంద్రంగా మార్చడమే కాకుండా మెడికల్ కాలేజీ కూడా తెచ్చాం. తుమ్మిళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి, ఉమ్మడి పాలమూరు జిల్లాలో 18.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. 22 నెలలు అయినా ఇప్పటిదాకా నిర్మాణ పనులను కొనసాగించకుండా గట్టు ప్రాజెక్టును పండబెట్టింది కాంగ్రెస్ అని గుర్తుంచుకోండి" అన్నారు.

కేటీఆర్ బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "ఎవరి అభివృద్ధి కోసం బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లాడు? పేదల కోసం అయితే ఆడబిడ్డలకు నెలకు రెండున్నర వేలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఎక్కడుంది? రెండు లక్షల రుణమాఫీ ఎక్కడ మాయమైంది? ఆడబిడ్డలకు స్కూటీ ఎక్కడ ఇచ్చారు? 20 లక్షల దళితబంధు ఎక్కడ? బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ ఏమైంది?" ఇలా అన్ని వర్గాల మిగితా 2వ పేజీలో



## తెలంగాణలో మరో నాలుగు రోజులు భారీ వర్షాలే..!

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో వర్షాలు మరో నాలుగు రోజులు కొనసాగనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీవర్షాలు పడతాయని తెలిపింది. అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలలో ఉరుములు, మెరుపులతో వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, రంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలలో మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. పలుచోట్ల ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని పేర్కొంది.

భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంచిర్యాల, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశముందని హెచ్చరించింది.

గడిచిన 24 గంటల్లో అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్ జిల్లా సిరికొండలో 11.8 సెంటీమీటర్లు, నాగర్‌కర్నూల్ జిల్లా చెన్నపురావుపల్లిలో 11.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ వెల్లడించింది.

## భారత ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం ప్రముఖ పాత్ర

- ఐఐఆర్‌ఎం స్నాతకోత్సవంలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత బీమా రంగం, సంస్థలు సన్నద్ధం కావాలని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా, దేశంలో వస్తున్న వాతావరణ, భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా బీమా సంస్థలు విధానాలు, పద్ధతులు, సేవలను రూపొందించుకోవాలని సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సురెన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ (ఐఐఆర్‌ఎం) స్నాతకోత్సవానికి ఎం.రాజేశ్వరరావు హాజరై మాట్లాడారు. ఆర్థిక రంగాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి స్థిరమైన ఆర్థికం, ప్రభావవంతమైన రిస్క్ మేనేజ్ నాయకత్వం అవసరన్నారు. ఐక్యరాజ్య సమితి 2020-23 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగిందని, ఈ వాతావరణ అసమానతలను నియంత్రించనట్లయితే ప్రపంచవ్యాప్తంగా 4 శాతం జీడీపీని నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీని ప్రభావం అన్నిరంగాలపై పడుతుందన్నారు. ముఖ్యంగా బీమా రంగంపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రస్తుతం 2023-24 ఆర్థిక సంవత్సరం లెక్కల ప్రకారం దేశంలో బీమా రంగం విస్తరణ తక్కువగా ఉందని, ప్రపంచవ్యాప్తంగా బీమా ప్రీమియం సగటు 7 శాతం కాగా భారతదేశంలో అది 3 శాతంగా ఉందని తెలిపారు. అయితే ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం భవిష్యత్తులో మన దేశంలో ఆర్థిక రంగం కంటే ఎక్కువగా బీమారంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 2024-28 మధ్యకాలంలో దేశంలో బీమా రంగం వృద్ధి 11 శాతం ఉంటుందని భారత బీమారంగం మిగితా 2వ పేజీలో

## చిన్నారుల భద్రత-ప్రజాప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత




- పిల్లల భవిష్యత్తు రక్షణకు సమాజం కలిసికట్టుగా కృషి చేయాలి
- మహిళ, చిన్నారుల భద్రత కోసం త్వరలో నూతన పాలసీ
- ప్రతి చిన్నారికి భద్రతతో కూడిన బాల్యం మా ప్రభుత్వ లక్ష్యం
- సిఐఐ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని హొటల్ పార్క్ ప్రాంగణంలో సిఐఐ, యంగ్ ఇండియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాసూమ్ సమిట్ 10వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారుల భద్రత, మహిళల రక్షణ, పోషకాహారం, మహిళా సాధికారత వంటి కీలక అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా డీ.జీ. శికా గోయల్, సిఐఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ శివప్రసాద్ రెడ్డి, మాసూమ్ యంగ్ ఇండియన్స్ చైర్ జోష్నా సింగ్ అగర్వాల్, యంగ్ ఇండియన్స్ నేషనల్ చైర్మన్ తరంగ్ ఖురానా, మాసూమ్ కోచ్ భవిన్ పాండ్యా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, చిన్నారుల రక్షణను తమ ప్రజా ప్రభుత్వం ప్రధాన బాధ్యతగా భావిస్తోందని స్పష్టం చేశారు. "పిల్లలు అంటే మన భవిష్యత్తు. వారి రక్షణ అంటే మన భవిష్యత్తు రక్షణ. పసి హృదయాల్లో నాటుకుపోయే భావనలే వారి జీవితాన్ని నిర్దేశిస్తాయి. చిన్నారి గాయపడితే ఆ గాయం జీవితాంతం వెంటాడుతుంది. అందుకే పిల్లలు నిర్భయంగా, స్వేచ్ఛగా, ధైర్యంగా జీవించే వాతావరణాన్ని కల్పించడం సమాజం మొత్తం బాధ్యత" అని ఆమె అన్నారు. మిగితా 2వ పేజీలో



## నాగార్జునసాగర్ డ్యామ్ జలకళ..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాగార్జునసాగర్ డ్యామ్ జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాజెక్టులన్నీ నిండుకుండా మారి వచ్చిన నీటిని దిగువనికి విడుదల చేయడమే కారణంగా డ్యామ్ వద్ద భారీ వరద ప్రవాహం ఏర్పడింది.ఎగువ శ్రీశైలం జలాశయం 7 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,93,634 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 66,280 క్యూసెక్కుల నీటిని, మొత్తం 2,81,352 క్యూసెక్కుల నీటిని సాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేస్తోంది. శనివారం సాయంత్రం నాగార్జునసాగర్ డ్యామ్ 26 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,09,794 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసింది.

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగుల వద్ద ఉండగా, ప్రస్తుత నిల్వ 589.70 అడుగుల వద్ద ఉంది. డ్యామ్ పూర్తిస్థాయి సామర్థ్యం 312 టిఎంసిలు, ప్రస్తుతానికి 311.1486 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 32,764 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 9,019 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,325 క్యూసెక్కులు, ఎస్.ఎల్.బి.సి ద్వారా 2,400 క్యూసెక్కులు, లోలెవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం 2,60,602 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

26 క్రస్ట్ గేట్ల ద్వారా ప్రవాహిస్తున్న కృష్ణమ్మ జలాలను చూడటానికి పర్యాటకులు వర్షాన్ని లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పర్యాటకులు జలపాతం ముందు తమ సెల్ ఫోన్లలో సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాగర్‌లోని అనుపు, బుద్ధవనం, కొత్త వంతెన, పాత వంతెన వంటి పర్యాటక ప్రాంతాల్లో సందడి నెలకొంది. తెలంగాణ టూరిజం ఏర్పాటు చేసిన లాంచీ సర్వీస్ ద్వారా పర్యాటకులు ప్రత్యేకంగా ఆనందం పొందారు.

## డీజీపీ ఎదుట మావోయిస్టు అగ్రనేత లొంగుబాటు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మావోయిస్టులు భవిష్యత్తు లేని మార్గాన్ని వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసి ప్రజాస్వామ్యయుతంగా సమస్యలపై పోరాడాలని రాష్ట్ర డీజీపీ జితేందర్ పిలుపునిచ్చారు. శనివారం డీజీపీ ఎదుట మావోయిస్టు అగ్రనేత, ఆ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలు పోతుల పద్మ, ఎలియాస్ కల్పన, అలియాస్ సుజాతక్క లొంగిపోయారు. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటివరకు 404 మంది అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. ఇందులో కేంద్రకమిటీ, రాష్ట్ర కమిటీలు మొదలుకొని డివిజన్ కమిటీ సభ్యులున్నారని తెలిపారు. 'పోరు వీడండి గ్రామాలకు తరలిరండి' అనే నినాదంతోపాటు మావోయిస్టుల పునరావాసానికి పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలు తగిన ఫలితాలిస్తున్నాయని అన్నారు. పోతుల సుజాత స్వస్థలం గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడని, ఆమె మొదట్లో ఆర్ఎస్‌యూ, జన నాట్యమండలిలో పని చేశారన్నారు. 1996లో కమాండర్‌గా విధులు నిర్వహించారని, 2001లో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేశారని, అనారోగ్య కారణాలతో సుజాత బయటికి వచ్చారని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య అని, ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌చార్జిగా ఉన్నారని తెలిపారు. 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్న ఆమెపై రూ.కోటి రివార్డు ఉంద న్నారు. ఆమెకు రూ.25 లక్షల రివార్డు అందిస్తున్నామన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని డీజీపీ పిలుపునిచ్చారు.

# శంషాబాద్‌లో రూ.500 కోట్ల విలువైన భూమి హైడ్రా స్వాధీనం

**బలగం టీవీ, హైదరాబాద్**

'పైగా భూములు' అంటూ ప్రభుత్వ భూములను కొంతమంది ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించి, నిర్మాణాలు చేపడితే శనివారం హైడ్రా అధికారులు ఆ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.500 కోట్లు ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని సాతంరాయి గ్రామం సర్వే నెంబర్ 17లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని 2011లో అప్పటి ప్రభుత్వం.. ఇంటర్మీడియట్ బోర్డుకి శిక్షణా కేంద్రాల ఏర్పాటు కోసం అప్పగించింది. అయితే ఆ భూమి పైగా భూమి అని పేర్కొంటూ కొంతమంది కబ్జా చేసి, అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ భూమిని విడిపించాలని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించింది. అది ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకొని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇనుప స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు.

ఈ సందర్భంగా హైడ్రా ఇన్‌స్పెక్టర్ సీహెచ్ తిరుమలేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పని చేస్తోందని తెలిపారు. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రభుత్వ భూములను జల్లెడ పడుతూ ఇప్పటికే వందలాది ఎకరాలను హైడ్రా స్వాధీనం చేసుకుందని చెప్పారు. సాతంరాయిలోని ఆ భూమిని ప్రభుత్వం 2011లో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డుకు కేటాయించిందన్నారు. అయితే ఈ భూమి తమదంటూ స్థానికంగా నాయకులుగా చెలామణి అవుతున్న ఒక నాయకుడితో పాటు అనీష్ కన్స్ట్రక్షన్స్ అనే సంస్థ క్లెయిమ్ చేస్తూ బోర్డులు పెట్టిందని తెలిపారు. కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించడంతో స్థానికులు హైడ్రాకు ఫోటోలు పంపించారని చెప్పారు. రాళ్ళు రప్పలతో వ్యవసాయ వినియోగానికి అవకాశం లేని ఈ ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేస్తున్నామంటూ అసఫ్ జాహీ పైగా కుటుంబ వారసుల నుంచి కొన్నామంటూ కబ్జాదారులు చెబుతున్నారని తెలిపారు. కాగా, శంషాబాద్ పరిధిలో పైగా కుటుంబాలకు చెందిన భూములు లేవని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారని తెలిపారు. వేరే చోట ఉన్న ఆ భూముల రికార్డులను ఇక్కడ చూపించి కబ్జాలకు పాల్పడినట్టు తెలిపారు. అనీష్ కన్స్ట్రక్షన్స్ సంస్థకు చెందిన శ్రీపాద దేశ్‌పాండే పలు భూముల వివాదాల్లో ఉన్నట్టు హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ అంశాలన్నింటినీ పరిశీలించి అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించిందని తెలిపారు. భూ వివాదంపై అనీష్ కన్స్ట్రక్షన్ సంస్థ యజమాని శ్రీపాద దేశ్‌పాండే మాట్లాడుతూ.. కోర్టులో కేసు ఉండగానే హైడ్రా అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా కూల్చివేయడం అన్యాయమని అన్నారు.

## రేవంత్‌కు దమ్ముంటే
# ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు పార్టీ మారాడని ప్రశ్నల వర్షం కురిపించారు.కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత కూడా "ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నాం" అని చెప్పుకోవడం దారుణమని ఆయన ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ నేతలు యూరియాను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. గ్రూప్-1 ఉద్యోగాలను కూడా అమ్ముకున్నారు. ప్రజలు నమ్మి ఓటేసి, ఇప్పుడు మోసపోతున్నారు. ఇందుకే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరాడా?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గద్వాల ఎమ్మెల్యే గతంలో చెప్పిన మాటలపై కూడా కేటీఆర్ విరుచుకుపడ్డారు. "కాంగ్రెస్‌లో చేరబోనని, చేరాల్సి వస్తే రైలుకింద తలపెడతానని చెప్పిన ఎమ్మెల్యే ఈ సభకు ఎందుకు రాలేదు? బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పుకుంటూ, కాంగ్రెస్‌కు లొంగిపోవడం ప్రజలను మోసం చేయడమే" అని ఆయన అన్నారు. వేలాదిమంది గద్వాలలో బీఆర్ఎస్ సభలో ఉంటే, బీఆర్ఎస్‌లోనే ఉన్నాను అని చెప్పుకుంటున్న గద్వాల ఎమ్మెల్యే మాత్రం రేవంత్ రెడ్డి సంకలో ఉన్నారని ఎద్దేవా చేశారు.

"రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. మళ్లీ యూరియా కష్టాలు, కరెంటు కోతలు మొదలయ్యాయి. కరోనా సమయంలో కూడా రైతుబంధు వేసిన ఘనత కేసీఆర్‌ది, అన్ని పథకాలను కష్టకాలంలో కూడా అమలు చేసిన ఘనత కేసీఆర్‌ది. బంగారు పళ్లెంలో పెట్టి ఇచ్చిన తెలంగాణను కాంగ్రెస్ పాడు చేసింది. అసమర్థ కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి నిరుద్యోగుల వరకు అన్ని వర్గాలు బాధ పడుతున్నాయి. విద్య నుంచి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైంది అన్నారు. రాష్ట్రంలో గురుకులాల పరిస్థితి గతంలో ఎట్లా ఉందో, ఇప్పుడెట్లా ఉందో అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ మోసం తప్ప మరేం చేయలేదు" అని కేటీఆర్ మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు ఉప ఎన్నికలు పెడితే ఎవరి సత్తా ఏమిటో తెలుస్తుంది. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి. గద్వాల మునిసిపాలిటీపై గులాబీ జెండా ఎగరాలి.

# వాగులో పడి నలుగురు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

ఒకే గ్రామానికి చెందిన నలుగురు వాగులో పడి మృతి చెందిన విషాదకర ఘటన ఆసిఫాబాద్-కుమురం భీం జిల్లా వాంకిడి మండలం డాబా గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తల్లీకొడుకు మోర్లె నిర్మల(25), గణేష్(10), అలాగే ఆడె శశికళ(12), వడాయి మహేశ్వరి(12) శనివారం మధ్యాహ్నం యూరియా బస్తాలు శుభ్రం చేయడానికి గ్రామ సమీప వాగులోకి వెళ్లారు. అక్కడ బస్తాలు శుభ్రపరుస్తుండగా ఓ బస్తా కొట్టుకుపోవడంతో గణేష్ ముందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు నీటమునిగాడు. గమనించిన తల్లి నిర్మల కొడుకునే రక్షించే ప్రయత్నం చేయగా ఆమెతో పాటు అక్కడే ఉన్న ఆడె శశికళ, వడాయి మహేశ్వరి నీటమునిగారు. ఆ సమయంలో అక్కడే బట్టలు ఉతుకుతున్న అదే గ్రామానికి చెందిన మోర్లె లలిత వారిని చూసి విషయాన్ని గ్రామస్తులకు తెలిపింది. దీంతో గ్రామస్తులు హుటాహుటిన వాగు వద్దకు రాగా.. అప్పటికే వారు మృతిచెందారు. ఒకే ఘటనలో గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మహేందర్-నిర్మల దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడు గణేష్ మండల కేంద్రంలోని గ్రీన్ హుడ్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆడె శశికళ, వాడై మహేశ్వరి గ్లోబల్ మీడియాలో ఐదో తరగతి చదువుతున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. విషయం తెలుసుకొని సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# ఫార్ములా- రేస్ కేసులో ఏసీబీకి విజిలెన్స్ రిపోర్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఫార్ములా-ఈ వన్ కారు రేస్ కేసులో నిందితులకు సంబంధించిన నివేదికను రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నుంచి విజిలెన్స్ కమిషన్‌కు నివేదిక చేరింది. ఈ నివేదికను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న విజిలెన్సు కమిషన్. దీనిపై తదుపరి న్యాయపరమైన చర్యలకు సంబంధించి ప్రభుత్వ అనుమతిని కోరనుంది. సాధారణంగా ఐఏఎస్‌లు, తత్సమాన హోదా కలిగిన అధికారులతోపాటు ఏదేనీ కేసులో ప్రజా ప్రతినిధుల హస్తముందని తేలితే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవటానికి విజిలెన్స్ కమిషన్‌కు ఏసీబీ నివేదికను పంపుతారు. దానిపై సమగ్రంగా పరిశీలన జరిపి, ప్రభుత్వానికి తదుపరి చర్యల కోసం విజిలెన్స్ తన నివేదికను అందజేస్తుంది. ఆపై ప్రభుత్వం ఇచ్చే ఆదేశాల మేరకు ఏసీబీ కోర్టులో ప్రాసిక్యూషన్ ప్రక్రియను చేపడుతుంది. ఫార్ములా-ఈ కారు రేస్ కేసులో దాదాపు రూ.54 కోట్ల మేర నిధుల మార్పిడి అక్రమంగా జరిగిందనీ, దానికి ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన అనుమతులు కానీ, రిజర్వ్ బ్యాంకు నుంచి ముందస్తు అనుమతులు గానీ తీసుకోకుండా అప్పటి మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి కేటీ రామారావు, హెచ్ఎండీఏ అప్పటి మేనేజింగ్ డైరెక్టర్ అర్విండ్ కుమార్, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఆ నిధులను విదేశీ కంపెనీకి తరలించటంపై నిబంధనలను అతిక్రమించారంటూ ఏసీబీ తన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా విదేశీ మారకద్రవ్యాన్ని ఇందుకు వినియోగించారని కూడా తెలిపింది. దీనిపై సమగ్ర విచారణ జరిపిన ఏసీబీ కేటీ రామారావును ప్రధాన నిందితుడిగా, అర్వింద్ కుమార్‌ను రెండో ముద్దాయిగా, బీఎల్ఎన్ రెడ్డిని మూడో ముద్దాయిగా చేరుస్తూ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడమేగాక ఈ ముగ్గురినీ విచారించింది. దీనిపై అన్ని ఆధారాలనూ సేకరించి, నిందితులను ప్రాసిక్యూషన్ చేయటానికి అనుమతిని కోరుతూ ఏసీబీ, విజిలెన్స్ కమిషన్‌కు నివేదికను పంపించింది. దీనిపై విజిలెన్స్ కమిషన్ ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నారు. తదుపరి చర్యల కోసం ఒకట్రెండు రోజుల్లో సీఎం కార్యాలయానికి కమిషన్ తన రిపోర్టును పంపించనుందని తెలిసింది. అదే సమయంలో కేటీ రామారావుపై గవర్నర్‌కు ఒక నివేదికను ప్రభుత్వం పంపించనుంది. కేటీ రామారావును ప్రాసిక్యూట్ చేయటానికి అనుమతిని తీసుకోనున్నారని సమాచారం.

# మన వాటా మనకు దక్కాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

నీటి వాటాల విషయంలో తీరని అన్యాయం చేసిందన్నారు.

దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్? ముందుకు తీసుకురావాలని సీఎం చెప్పారు.

శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్? స్కీమ్? ద్వారా రోజుకు పది టీఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందని అన్నారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతో పాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్?కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ తో పాటు పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూత పడే ప్రమాదం ముంచుకు వచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి విఘాతం కలుగుతోందన్నారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్? ఎదుట వాదనలుగా వినిపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని ముఖ్యమంత్రి గారు అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్?నగర్?, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకోలేకపోయిందని గుర్తు చేయాలన్నారు.

తెలంగాణ తరఫున వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని ముఖ్యమంత్రి గారు అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు, కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని ముఖ్యమంత్రి గారు న్యాయ నిపుణులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్ సీఎస్ వైద్యనాథన్, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ కుష్వేందర్ వోహ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం ప్రముఖ పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేసిందని, అందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీమా ప్రీమియం రూ.11.2 లక్షల కోట్లతో ఏడు శాతానికి పెరిగిందని అంచనా వేసిందని తెలిపారు. ఈ వృద్ధి సాంకేతిక అంశాలు, వాతావరణ మార్పులు, సూక్ష్మ ఆర్థిక వ్యవహారాలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఆర్థిక సంస్థలు ఈ మార్పులను సూక్ష్మంగా గమనిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఐఆర్‌డీఏఐ సభ్యులు రజయ్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ.. బీమా, ఆర్థిక సేవల రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని, గ్రాడ్యుయేట్లు వారి వృత్తిపరమైన ప్రయాణాల్లో ఆవిష్కరణ, అనుకూలతను ఎప్పటికప్పుడు స్వీకరించాలని సూచించారు. ముందుగా ఐఐఆర్ఎం డైరెక్టర్ అరవింద్ కుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ బీమా, రిస్క్ మేనేజ్ అనుబంధ ఆర్థిక సేవలలో ఆవిష్కరణ, నైతిక నాయకత్వాన్ని నడిపించే నిపుణులను పెంపొందించడంలో సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటించారు. సభకు ఐఐఆర్ఎం ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీకే మోహన్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో భారత ఇన్సురెన్స్ రెగ్యులేటరీ, డెవలప్ అథారిటీ (ఐఆర్‌డీఏఐ) సభ్యులు రజయ్ కుమార్ సిన్హా, పి.కె.అరోరా, సత్యజిత్ త్రిపాఠి, ఐఐటి సీఈఓ వెంకట్ చెంగవల్లి, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ చీఫ్ అభిషేక్ ముజుందార్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల భద్రత-ప్రజాప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

మహిళా భద్రతపై మాట్లాడుతూ, ఈ నెల 22న మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతాధికారులు పాల్గొనే మహిళా సదస్సు నిర్వహిస్తున్నామని, వారి అభిప్రాయాల ఆధారంగా కొత్త మహిళా భద్రతా పాలసీ తీసుకురాబోతున్నామని ప్రకటించారు.

చిన్నారుల పోషకాహారంపై దృష్టి సారిస్తూ, ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా పోషణ మాసం నిర్వహించనున్నట్లు తెలిపారు. "పిల్లల్లో పౌష్టికాహారం పెంపొందించేందుకు పరిశోధనలు జరిపి అంగన్వాడి మెనూలో మార్పులు చేశాము. పౌష్టికాహారం ప్రాధాన్యతపై నెలరోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము" అని వివరించారు.

లైంగిక నేరాల నియంత్రణలో కేవలం శిక్షలకే పరిమితం కాకుండా శిక్షణా కార్యక్రమాలు కూడా ఉండాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. "ఆడవారిని గౌరవించాలని తరగతి గదిలోనే నేర్పాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై ఇళ్లలో, పాఠశాలల్లో, గ్రామాల్లో తప్పనిసరిగా చర్చ జరగాలి. తప్పు జరిగితే పిల్లలు ధైర్యంగా మాట్లాడే వాతావరణాన్ని కల్పించాలి" అని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ప్రాముఖ్యతను గుర్తుచేసిన ఆమె, 1975లో ఇందిరాగాంధీ ప్రారంభించిన ఈ వ్యవస్థ, ఇప్పుడు పోషకాహారంతో పాటు ఆరోగ్యం, ఆనందం, ప్రాథమిక విద్య అందిస్తున్నదని వివరించారు.

చిన్నారుల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. అలాగే డ్రగ్స్ నియంత్రణకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పోలీస్ శాఖలో ప్రత్యేక నార్కోటిక్స్ విభాగాన్ని ఏర్పాటు చేసి, నిఘాను పెంచినట్లు చెప్పారు. మహిళా సాధికారతపై మాట్లాడుతూ, "మహిళా సంఘాలను బలోపేతం చేసి వారిని సామాజిక, ఆర్థికంగా బలపరచడం ద్వారా చిన్నారుల రక్షణను సుస్థిరం చేస్తున్నాం.

అంబేద్కర్ గారు చెప్పినట్లుగా మహిళా ప్రగతితోనే సమాజం అభివృద్ధి చెందుతుంది" అన్నారు. ప్రభుత్వ చర్యల గురించి మాట్లాడుతూ, హెల్ప్‌లైన్‌లు, కౌన్సెలింగ్, ప్రత్యేక బృందాల ద్వారా బాధిత చిన్నారులకు అండగా నిలుస్తున్నామని, పాఠశాలల్లో అమ్మాయిలకు స్వీయ రక్షణ శిక్షణ ఇవ్వడం జరుగుతోందని వివరించారు.

మాసూమ్ కార్యక్రమంపై అభినందనలు తెలిపిన మంత్రి, "మీరు పది సంవత్సరాలుగా పిల్లల భద్రత కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయం. సమాజంలో ఉండే మౌనాన్ని తొలగించి అమ్మాయిల భద్రతను చర్చించే వేదికను సృష్టించారు. మా ప్రజా ప్రభుత్వం మీతో కలిసి పనిచేసి ప్రతి చిన్నారి భయపడకుండా స్వేచ్ఛగా కలలు కనగల వాతావరణాన్ని నిర్మిస్తుంది" అని హామీ ఇచ్చారు.

# కోనరావుపేటలో కాంగ్రెస్‌లోకి చేరికలు



- కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కోనరావుపేటలో ఖాళీ అవుతున్న బీఆర్ఎస్ పార్టీ..
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ పార్టీ..

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగానే రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ అబ్బాసాని శంకర్ గౌడ్, మరియు పలువురు ముఖ్య నాయకులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కోనరావుపేట మండల మాజీ ఎంపీపీ, మాజీ ప్యాక్స్ చైర్మన్ అయిన అబ్బాసాని శంకర్ గౌడ్‌తో పాటు, మర్రిమడ్ల మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, కొలనూరు ప్యాక్స్ డైరెక్టర్ ఇప్ప రాములు, మాజీ వార్డు సభ్యులు శంకరవ్వ, బొడ్డు కిషన్ మరియు సుమారు 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి నాయకులు కాంగ్రెస్ లో చేరుతున్నారని అన్నారు. "ఈ రోజు నుండి మీరంతా కాంగ్రెస్ కుటుంబ సభ్యులు. మీ యోగక్షేమాలను పార్టీ చూసుకుంటుంది," అని ఆయన భరోసా ఇచ్చారు. గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారి అనుభవం కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. యువత మరియు వివిధ రంగాల నుండి సేవ చేస్తున్నవారు కాంగ్రెస్ ద్వారా ప్రజాసేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై విమర్శలు గుప్పిస్తూ, ఆ ప్రభుత్వంలో అవినీతి, నాణ్యతలేని కట్టడాలు పెరిగిపోయాయని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని శ్రీనివాస్ అన్నారు. అయినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పులను పట్టించుకోకుండా సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇందిర ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 10 లక్షల ఆరోగ్య శ్రీ, రూ. 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని మోసం చేసిందని, కానీ ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదని అన్నారు. గత ప్రభుత్వ అసమర్థత కారణంగా చేయలేని పనులను నేడు తాము పూర్తి చేస్తున్నామని, కేవలం కాగితాలపై మాత్రమే అభివృద్ధిని చూపిన గత ప్రభుత్వానికి భిన్నంగా, క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తున్నామని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమను ఆకర్షించాయని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో "దొరల పాలన" కారణంగా తమకు సరైన గుర్తింపు లభించలేదని, బీసీ బిడ్డ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఆది శ్రీనివాస్ నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడమే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు.

## నేటి కోడెల పంపిణీ రద్దు..

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో రేపు ఆదివారం కోడెల పంపిణీ కార్యక్రమాన్ని అనివార్యకారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరూ గమనించాలని సూచించారు. కోడెల పంపిణీ మళ్లీ తదుపరి తేదీ ఎప్పుడు పంపిణి చేస్తామనే విషయం ప్రకటిస్తామని ఈ ప్రకటన లో స్పష్టం చేశారు.



## జిల్లెల్ల గ్రామంలో ఆదర్శంగా నిలిచిన కట్టమైసమ్మ యూత్

- రూ. లక్షతో ఆలయ నిర్మాణం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామంలోని ఇతర యువతకు ఆదర్శంగా నిలుస్తూ, జిల్లెల్ల గ్రామంలోని కట్టమైసమ్మ యూత్ సభ్యులు తమ గ్రామదేవత అయిన కట్టమైసమ్మ ఆలయాన్ని లక్ష రూపాయల సొంత ఖర్చుతో నిర్మించారు. ఈ ఆలయంతో పాటు, మెట్ల మార్గాన్ని కూడా నిర్మించి గ్రామస్తులకు సౌలభ్యం కల్పించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ, ప్రతి యువకుడు కూడా తమ గ్రామాభివృద్ధిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తూ జిల్లెల్ల గ్రామం అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల పాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్, రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు, మాజీ సింగిల్ విండో చైర్మన్ పబ్బతి విజయందర్ రెడ్డి ఈ నిర్మాణాన్ని అభినందించారు. అలాగే, డైరెక్టర్లు కందుకూరి గణేష్ గౌడ్, అబ్బడి అనిల్ రెడ్డి, కుల సంఘాల పెద్దలు కపరవేని మల్లయ్య, కందుకూరి పర్శరం గౌడ్, చీకటి కనకయ్య, కాంగ్రెస్ నాయకులు మనోజ్ గౌడ్, కట్టమైసమ్మ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలి..

- బీఆర్ఎస్ విద్యార్థి నాయకుడు కంచర్ల రవి గౌడ్
- నిరుద్యోగుల అరెస్టును ఖండించిన రవి




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రోజున ఆందోళన చేపట్టిన విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ విద్యార్థి నాయకుడు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, గ్రూప్-1 పరీక్షను హైకోర్టు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఎన్ని అరెస్టులు చేసినా, కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బిఆర్?ఎస్? వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో నిరుద్యోగులకు అండగా పోరాడతామని పేర్కొన్నారు.

అదే విధంగా, కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని ఆరోపించారు. గతంలో ఎన్నికల సమయంలో బీసీలకు సబ్ ప్లాన్, రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ రిజర్వేషన్లు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, రాజకీయంగా గాని ఆర్థికంగా గాని ఉద్యోగంగా రిజర్వేషన్ చేస్తామని కామారెడ్డి సభ సాక్షిగా చెప్పడం జరిగిందని అన్నారు. కానీ వాటిని నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. బీసీల కోసం ఢిల్లీలో ధర్నా చేసి ఏం సాధించారని ప్రశ్నించారు. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన నిలబడి కేటీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తామని రవి గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. అఫ్రోజ్, కోడం వెంకటేష్, వేముల శ్రీకాంత్, మాలోత్ రాకేష్ నాయక్, లింగంపల్లి అభి, అందె సుదర్శన్, శ్రీకాంత్, హరీష్, జగన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేల దిష్టిబొమ్మ దగ్ధం..

- దమ్ము ధైర్యం ఉంటే రాజీనామా చేసి బై ఎలక్షన్ కు రండి..
- బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని చేనేత విగ్రహ ఆవరణలో ఫిరాయింపు ఎమ్మెల్యేల దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, దమ్ము, ధైర్యం ఉంటే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి బై ఎలక్షన్లలో పోటీ చేయాలని సవాల్ విసిరారు. టీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదని చెప్పడం సిగ్గుచేటని రవి గౌడ్ అన్నారు. ధైర్యం లేకపోవడం వల్లే వారు రాజీనామా చేయకుండా పదవులకు అతుక్కుపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరినప్పుడే ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారని, ఇప్పుడు బీఆర్ఎస్ లోనే ఉన్నామని చెప్పడం ప్రజలను అవమానించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు మీ అందరినీ అసహ్యించుకుంటున్నారని తెలిపారు. "రేవంత్ రెడ్డి పాట పాడుతూ తిరిగే మీరు బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు రావడం ఎందుకు? ప్రజల కష్టాలపై మాట్లాడే ధైర్యం మీకుందా?" అని ఆయన ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ప్రజలు మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. ఇప్పటికైనా దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఎస్.కే. అఫ్రోజ్, బూత్ కురి శివరాజ్, కోడం వెంకటేశం, ముద్దం అనిల్ గౌడ్, అందే సుదర్శన్, హరీష్, శ్రీనివాసరావు జగన్, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ..

- పట్టుకున్న బోయినిపల్లి ఎస్సై రమకాంత్

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని ఒక పాత ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన పిడిఎస్ బియ్యం ఉన్నట్లు పక్క సమాచారం అందడంతో ఎస్సై రామకాంత్ తన సిబ్బందితో వెంటనే వెళ్లి చూసి,దానికి సంబంధించినటువంటి కోనరావుపేట మండలం కొండపూర్ గ్రామానికి చెందిన పెద్దగంటి అంజయ్య తండ్రి ఎల్లయ్య వ్యక్తిని పట్టుకొని, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపినారు.

## ఎస్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఆరుకుటి మల్లేశం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



ఎస్‌టీయూ యూనియన్ రాజన్న సిరిసిల్లా జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఆరుకుటి మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాలిపల్లి గ్రామానికి చెందిన మల్లేశం మండలం లోని ఆరెపల్లి ప్రాథమిక పాఠశాల లో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ టీ యూ సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల సాధనకై తనవంతు కృషి చేస్తానని అన్నారు.

# నేడే భారత్ -పాకిస్థాన్ హైఓల్టేజ్ మ్యాచ్

**బలగం టీవీ, హైదరాబాద్**



యావత్ క్రికెట్ ప్రపంచం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారత్–పాకిస్థాన్ హైఓల్టేజ్ పోరుకు రంగం సిద్ధమైంది. ఆసియా కప్–2025లో భాగంగా ఈ రాత్రి 8 గంటలకు దుబాయ్ వేదికగా ఇరు జట్లు తలపడనున్నాయి. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ ఘటనలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ మ్యాచ్ మరింత హాట్‌టాపిక్‌గా మారింది. ఈ పోరును అభిమానులు సాధారణ క్రికెట్ మ్యాచ్‌గా కాకుండా యుద్ధంలా భావిస్తున్నారు. లీగ్‌లో భారత్ యూఏఈపై 9 వికెట్ల తేడాతో గెలవగా, పాకిస్థాన్ ఒమన్‌పై 93 పరుగుల తేడాతో విజయం సాధించింది. గ్రూప్–ఏలో టాప్‌లో నిలవాలంటే ఈ పోరు కీలకమైంది.

**హాట్ ఫేవరేట్ టీమిండియా**

ప్రస్తుత ఫామ్‌ను పరిగణలోకి తీసుకున్నా, చరిత్రను పరిశీలించినా టీమిండియానే హాట్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. వరల్డ్ ఛాంపియన్ టైటిల్‌తో భారత్ బలంగా ఉండగా, పాకిస్థాన్ జట్టు పూర్తిగా యువ ఆటగాళ్లపై ఆధారపడి ఉంది. అయితే భారత్–పాక్ పోరు ఒత్తిడితో నిండిపోతుందనేది క్రికెట్ నిపుణుల అభిప్రాయం. ఆ ఒత్తిడిని అధిగమించే జట్టే విజయం సాధిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఈ పోరును సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్స్ (1, 2, 3, 4)తో పాటు ఓటీటీ ప్లాట్‌ఫారమ్ సోనీ లివ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. డీడీ స్పోర్ట్స్‌లో ప్రసారం ఉండదు. సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సిందే.

**ముఖాముఖి రికార్డ్ భారత్‌దే పైచేయి**

ఆసియా కప్ చరిత్రలో భారత్ పూర్తి ఆధిపత్యం చాటింది. ఇప్పటివరకు జరిగిన 16 ఎడిషన్లలో భారత్ 8 సార్లు విజేతగా నిలవగా, పాకిస్థాన్ కేవలం రెండుసార్లు మాత్రమే టైటిల్ సాధించింది. టీ20 ఫార్మాట్‌లో ఇరు జట్లు మూడు సార్లు తలపడగా భారత్ రెండుసార్లు, పాక్ ఒక్కసారి గెలిచింది. గత ఐదేళ్లలో భారత్–పాక్ ఐదు పోరులో భారత్ 3–2 ఆధిక్యంలో ఉంది.

# బంగ్లాదేశ్‌పై శ్రీలంక విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆసియా కప్–2025లో మాజీ ఛాంపియన్ శ్రీలంక విజయానికి నాంది పలికింది. గ్రూప్–బీ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 6 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తొలుత ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేసిన లంక, అనంతరం 140 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించి పాయింట్ల ఖాతా తెరిచింది.

**నిశాంక హాఫ్ సెంచరీతో మెరుపు**

ఓపెనర్ పథుమ్ నిశాంక (50) అర్ధ సెంచరీతో చెలరేగి లంక విజయానికి పునాది వేసాడు. రెండో ఓవర్లోనే కుశాల్ మెండిస్ (3) ఔటైనా, నిశాంక–కమిల్ మిషరా (46 నాటౌట్) జోడీగా 95 పరుగుల భాగస్వామ్యం కట్టి బంగ్లాపై ఒత్తిడి తెచ్చారు. పది ఓవర్లకే విజయావకాశాలు లంక వైపు ఒగ్గాయి. అర్ధ సెంచరీ అనంతరం నిశాంక మెహిదీ హసన్ బౌలింగ్‌లో ఔటైనా, మిషరా అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించాడు. కుశాల్ పెరీరా (9), దసున్ శనక (1) పెవిలియన్ చేరినా, మిషరా ధైర్యంగా ఆడి 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకున్నాడు. రెండో విజయంతో సూపర్–4 దిశగా పయనించాలనుకున్న లిటన్ దాస్ బృందానికి ఈ ఓటమి నిరాశ మిగిల్చింది. బౌలర్ల కృషిని బ్యాటర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు.

# బ్యూటీ ట్రైలర్ విడుదల

## నాగచైతన్య చేతుల మీదుగా ట్రైలర్ లాంచ్

**బలగం టీవీ, హైదరాబాద్**




అంకిత్ కొయ్య, నీలఖి కాంబినేషన్‌లో రూపొందుతున్న బ్యూటీ చిత్రానికి జేఎస్ఎస్ వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయనే ఈ చిత్రానికి డైలాగ్స్ కూడా అందించారు. ఇప్పటికే పోస్టర్లు, టీజర్‌కు మంచి స్పందన రాగా, తాజాగా ట్రైలర్‌ను టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య విడుదల చేశారు. చైతూ సోషల్ మీడియాలో ఈ విషయాన్ని షేర్ చేస్తూ ప్రేక్షకులతో పంచుకున్నారు.

ట్రైలర్‌లో హీరో–హీరోయిన్ల ప్రేమకథ, మధ్యలో వచ్చే మలుపులు, తండ్రీ–కూతుళ్ల సంబంధం ప్రధాన ఆకర్షణలుగా కనిపిస్తున్నాయి. "నిన్ను వదిలేయడమంటే ఊపిరి వదిలేయడమే" అంటూ నీలఖి చెప్పే డైలాగ్, "అందరికీ ఉంటారు కూతుళ్లు.. కానీ ఇలా నెత్తిమీద పెట్టుకుని చూసేవాళ్లు మాత్రం మీరే ఉంటారు" అన్న మాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.ఈ చిత్రంలో టాలీవుడ్ సీనియర్ నటుడు నరేశ్ కూడా ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. "కూతురు అడిగింది కొనిచ్చేటప్పుడు వచ్చే కిక్కు ఓ మధ్యతరగతి తండ్రికే తెలుస్తుంది" అన్న భావోద్వేగ డైలాగ్ ఇప్పటికే చర్చనీయాంశమైంది. విజయ్ బల్గానిన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్‌తో సినిమా పై ఆసక్తి మరింత పెరిగింది.

# మహిళల హాకీ ఆసియా కప్ ఫైనల్‌లో భారత్

**బలగం టీవీ, హైదరాబాద్**



మహిళల ఆసియా కప్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కి చేరింది. శుక్రవారం జరిగిన సూపర్–4 మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌తో భారత్ 1–1తో డ్రా ఆడింది. మరో మ్యాచ్‌లో చైనా కొరియాపై 1–0 తేడాతో గెలుపొందడంతో పట్టికలో భారత్ రెండో స్థానంలో నిలిచి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్‌లో భారత్, చైనా ట్రోఫీ కోసం తలపడనున్నాయి. ఫైనల్లో గెలిచిన జట్టు వచ్చే ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరగనున్న ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్‌కి నేరుగా అర్హత సాధించనుంది.

**గోల్‌తో ముందంజలో టీమిండియా**

ఆరంభం నుంచి ఆత్మవిశ్వాసంతో ఆడిన భారత్ 7వ నిమిషంలోనే గోల్ సాధించింది. నేహా గోయల్ కొట్టిన బంతిని జపాన్ రక్షణ ప్లేయర్ అడ్డుకునే ప్రయత్నం విఫలమైంది. రిఫరీ గోల్‌ను చెల్లుబాటు చేసిన తరువాత భారత్ 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది.

రెండో అర్ధ భాగంలో జపాన్ దూకుడుగా ఆడింది. పలు పెనాల్టీ కార్నర్లు లభించినా భారత గోల్‌కీపర్ సమర్థంగా అడ్డుకుంది. అయితే చివరి నిమిషాల్లో షిమో కొబయకవడా గోల్ సాధించడంతో జపాన్ స్కోరును సమం చేసింది. దీంతో మ్యాచ్ 1–1తో ముగిసింది.

సూరజ్ లతా దేవీ నాయకత్వంలోని టీమిండియా సూపర్–4లో నాలుగు పాయింట్లతో ఫైనల్‌కు చేరింది. ఆసియా కప్ ఆరంభం నుంచి చెలరేగిన భారత జట్టు, బలమైన జపాన్‌ను నిలువరిస్తూ తన జోరు కొనసాగించింది.

# కొత్త ముఖాలకు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పిలుపు

## ప్రొడక్షన్ నెం. 37 కోసం కాస్టింగ్ ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తమ కొత్త చిత్రానికి నూతన నటీనటుల నుంచి దరఖాస్తులు కోరుతూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. నటనపై ఆసక్తి కలిగి, సినీ రంగంలో అడుగుపెట్టాలనుకునే యువతకు ఇది ఒక మంచి అవకాశం అని సంస్థ స్పష్టం చేసింది.

సితార బ్యానర్‌లో రూపొందనున్న ప్రొడక్షన్ నెం. 37లో నటించేందుకు 18 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతీయువకులతో పాటు 20 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.ప్రొఫైల్–ఫోటోలు–వీడియోలు పంపాలిఆసక్తి గల అభ్యర్థులు తమ ప్రొఫైల్స్, ఫోటోలు, నటనకు సంబంధించిన వీడియోలను sitharaentscasting@gmail.com కు లేదా వాట్సాప్ నంబర్: 8801990954 కు పంపవచ్చని సంస్థ వివరించింది.




# 50 రోజులు పూర్తి చేసుకున్న 'మహావతార్ నరసింహ'

**బలగం టీవీ, హైదరాబాద్**

హిందూ పురాణాల నేపథ్యంలో యానిమేటెడ్ చిత్రంగా రూపొందిన 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద విజయరథం సాగిస్తోంది. హొంబలే ఫిల్మ్స్, క్లీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం జూలై 25న విడుదలై ప్రపంచవ్యాప్తంగా మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా ఇప్పటికే 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది.

విడుదలై నేటికి 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ మూవీ నుంచి ఓ డిలీటెడ్ సీన్‌ను ప్రేక్షకుల కోసం విడుదల చేశారు. అభిమానులు ఆ సీన్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హిందూ పురాణాల్లోని శ్రీమహావిష్ణువు దశావతారాలను ఆధారంగా చేసుకుని ఏడు భాగాలుగా రూపొందించే మహావతార్ సినిమాటిక్ యూనివర్స్లో ఇది మొదటి భాగం కావడం విశేషం. దర్శకుడు అశ్విన్ కుమార్ సృజనాత్మకతకు ఈ చిత్రం నిదర్శనం. ఈ భారీ విజయం యానిమేటెడ్ చిత్రాలకు భారతదేశంలో విశాల భవిష్యత్తు ఉందని నిరూపించిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మిరాయ్ తుఫాన్ తొలి రోజే రికార్డు వసూళ్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్‌లోనే కాదు.. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఒక్క సినిమా గురించే హల్‌చల్ జరుగుతోంది. అదే తేజ సజ్జ నటించిన 'మిరాయ్'. సెప్టెంబర్ 12న గ్రాండ్‌గా విడుదలైన ఈ విజువల్ వండర్ తొలి రోజే యూనానిమస్ బ్లాక్‌బస్టర్ టాక్‌తో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. కథ, స్క్రీన్‌ప్లే, గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్, మ్యూజిక్ ఇలా ప్రతి విభాగంలోనూ మిరాయ్ ప్రేక్షకులను అద్భుతంగా ఎంగేజ్ చేస్తోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా చూసిన వారు "ఇది టాలీవుడ్ సినిమా కాదు, హాలీవుడ్ రేంజ్!" అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

మేకర్స్ విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం, మిరాయ్ ఫస్ట్ డే కలెక్షన్ (భారత్): రూ.27.20 కోట్లు. విదేశాల్లోనూ మంచి స్పందన రావడంతో నార్త్ అమెరికా డే 1 కలెక్షన్: డాలర్ 700,000 (సుమారు రూ.6 కోట్లు) సాధించింది. ఈ ఏడాది విడుదలైన సినిమాల్లో ఇదొక టాప్ ఓపెనింగ్గా నిలిచింది. తేజ సజ్జ పూర్వ చిత్రం హనుమాన్ మొదటి రోజే రూ.10 కోట్లు వసూలు చేసింది. అయితే మిరాయ్ ఆ రికార్డును తలకిందలు చేస్తూ మూడు రెట్లు ఎక్కువ వసూళ్లు సాధించి 2025లో టాలీవుడ్ నెంబర్ వన్ ఓపెనర్‌గా నిలిచింది. ఇప్పటికే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న ఈ చిత్రం, వీకెండ్ కలెక్షన్లలో మరింత సత్తా చాటే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా మల్టిప్లెక్స్, అర్బన్ ఏరియాల్లో టికెట్ డిమాండ్ అధికంగా ఉందని సమాచారం.తొలి రోజు రికార్డు వసూళ్లతో ఉబ్బితబ్బిబైన మేకర్స్, "బ్రహ్మాండ బ్లాక్‌బస్టర్" అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో మిరాయ్ విజువల్స్‌కి బిగ్‌స్క్రీన్‌లో వచ్చిన రెస్పాన్స్‌ను హైలైట్ చేశారు మొత్తానికి మిరాయ్ టాలీవుడ్‌లో ఒక కొత్త ట్రెండ్ను సెట్ చేసింది. కంటెంట్, టెక్నికల్ వాల్యూస్, ప్రెజెంటేషన్ అన్నీ ప్రేక్షకులకు ఓ హై ఎండ్ సినిమా అనుభవంనిచ్చాయి.

# మిరాయ్ సక్సెస్ మీట్‌లో ఎమోషనల్ అయిన మంచు మనోజ్

**బలగం టీవీ, హైదరాబాద్**



చాలాకాలం తర్వాత మంచు మనోజ్ కెరీర్‌లో మలుపు తిప్పిన సినిమా మిరాయ్. ఈ సందర్భంగా జరిగిన సక్సెస్ మీట్‌లో మనోజ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

"హను–మాన్ ట్రైలర్ రాకముందే, డైరెక్టర్ తేజాతో మిరాయ్ సినిమా చేయాలని నిర్ణయించాం. ఎవరూ పట్టించుకోని సమయంలో నాపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చారు. నిర్మాతపై కూడా చాలా ఒత్తిడులు ఉండి ఉంటాయి. కానీ ఆయన నన్ను నమ్మారు. దానికి నేను జీవితాంతం రుణపడి ఉంటాను" అని మనోజ్ భావోద్వేగంగా చెప్పారు. తన కెరీర్‌లో ఎప్పటికప్పుడు కొత్తగా చేయాలని ఆరాటం ఉండేదని, మిరాయ్ ఆ కోరికను నెరవేర్చిందని చెప్పారు. "ఫ్యాన్స్ ఎప్పుడూ 'నీ కమ్‌బ్యాక్ ఎప్పుడు అన్నా? నువ్వు కేవలం ఒక సినిమా చేయి.. హిట్ సంగతి మాకు వదిలేయ్' అని అడిగేవారు. అప్పుడు నవ్వుతూ 'వస్తున్నాను తమ్ముడు' అనేవాడిని. కానీ లోపల భయం ఉండేది. ఎన్నో సినిమాలు దగ్గరికి వచ్చి చేజారిపోయాయి" అని మనోజ్ గుర్తుచేసుకున్నారు.